# క్రీస్తు శరీరం

సంఘాన్ని చిత్రించడంలో లేఖనాలు దైవప్రేరేపితమైన అనేక రూప చిత్రాలను వినియోగిస్తున్నాయి. ఆ సంస్థను గూర్చిన వర్తమానం కొరకు ఎక్కువగా మనం ఈ రూపచిత్రాలపై ఆధారపడియుంటాం. అవి లేకుండ మనం నిజంగా అభాగ్యులమై యుండేవారం. సంఘాన్ని చిత్రించే సాధనంగా మానవ దేహాన్ని ఉదాహరణగా ఎన్నుకొనడంలో, దైవప్రేరేపణ బహు అల్పమైనదైనా, గొప్ప లోతైన సాదృశ్యాన్ని తీసికొంది. ఈ పోలికలో మూడు ముఖ్యమైన సత్యాలు సూచింపబడ్డాయి.

## సంఘముతో క్రీస్తు బాంధవ్యం

సంఘంతో తనకు గల సంబంధంలో క్రీస్తు శిరస్సై యున్నాడు. ఈ రూపకాలంకారం ఎఫెసీ. 1:22, 23; కొలస్సీ. 1:18, 24ల్లో ఉపయోగింపబడింది. ఈ లేఖన భాగాలు క్రీస్తు సంఘమునకు శిరస్సైయున్నాడని చెప్పడం మాత్రమే గాక, ఆయన ఎప్పుడు దానికి శిరస్సుగా రూపొందడాన్ని అధికమైన సమాచారాన్ని అది తెలుపుతోంది: ఆయన పునరుత్థానం, ఆరోహణాలు జరిగిన పిమ్మటయని అది సూచిస్తుంది. అనేకమంది వాదిస్తున్నట్టు, క్రీస్తు మరణానికిముందే సంఘం ఉండియున్నట్టయితే, అది శిరస్సులేని శరీరమైయుండాలి. సంఘము అబ్రాహాము దినాలలో లేక బాప్తిస్మమిచ్చు యోహాను దినాలలో ఉన్నదనే తప్పుడు భావనను యిది ఖండిస్తుంది. తన పునరుత్థానం తరువాతనే క్రీస్తు సంఘమునకు శిరస్సై యున్నట్టు ఈ లేఖన భాగం తెలుపుతోంది; మరియు మనం యింకా దాన్ని పరిశీలించినప్పుడు, ఆయన పునరుత్థానం తరువాత ఏభై దినాలకు, పెంతెకొస్తు దినాన (అపొ. 2) ఆయన శిరస్సుగా చేయబడినట్టు మనకు తెలుస్తుంది. అది సంఘము యొక్క పుట్టుక దినం. ఆ సంఘ శరీరంపై మధ్యవర్తిత్వంతో కూడిన ఏలుబడిని క్రీస్తు ఆరంభించాడు.

క్రీస్తు శిరస్సై యుండడం, ఆయన ఏలుబడి, ఆయన ఆధిపత్యం అనేవి అధికారము మరియు ప్రభుత్వం అనే భావాలను చాలా ఉత్తమమైన విధానంలో తెలియజేస్తాయి. మత్తయి 28:18లో ఆయన చెప్పుకున్నట్టే, క్రీస్తుకు సర్వాధికారమున్నదని అది తెలుపుతోంది. ఆయన తన సంఘాన్ని ఏలువాడైయున్నాడు. ఈ విధమైన ప్రభుత్వము పరిపూర్ణమైన ఏకాధిపత్యాన్ని తెలుపుతుంది.

ఈ ఏకాధిపత్యం యొక్క విశేష లక్షణం పరిపూర్ణతయైయుంది. సంఘము యొక్క శిరస్సు జ్ఞానమందును ప్రేమయందును పరిపూర్ణుడై యున్నాడు; ఆయన ఏ తప్పిదము చేయనివాడు. మతపరమైన సమస్త విషయాలకు చివరిగా ఆయన అధికార స్వరం వైపు మనం చూడాలి. సంఘానికి గాని, మన మనస్సాక్షి వద్దకు గాని, మోషే వద్దకు గాని లేక పారంపర్యాలవైపుకు గాని మనం వెళ్లడానికి వీలులేదు.

పేతురు సంఘానికి శిరస్సై ఉన్నాడని రుజువు చేయడానికి ప్రయాసపడే ఒకని కలంనుండి వెలువడిన దీర్ఘమైన చర్చను నేను చదివాను. పేతురును, అతని వారసులును సంఘమునకు శిరస్సులైయున్నట్టు రూపించడానికి అతడు గొప్ప వివరాలలోనికి వెళ్లాడు. అతని వాదనలలో ఒకటి, శిరస్సు అవసరం అనేది. సంఘానికి శిరస్సు అవసరమనే సత్యాన్ని మనం కాదనం సరిగదా, దానికి ఒకరున్నారన్న సత్యాన్ని కూడా కాదనం. అయితే, మానవ శిరస్సు క్రీస్తు సంఘం మీద శిరస్సుగా నియమించబడిందన్న విషయాన్ని మాత్రం కఠినంగా కాదంటాం. దానికి ఒక్కడే శిరస్సు క్రీస్తు. దైవ ప్రేరేపితులైన తన రాయబారుల ద్వారా ఆయన మాట్లాడాడు (2 కొరింథీ. 5:20), మరియు వారికి వారసులెవ్వరూ లేరు.

క్రీస్తు సంఘమునకు శిరస్సై యున్నాడని తెలిసిన, ప్రతివాని మనస్సులో సంఘం ఘనంగా ఎంచబడవలసియుంటుంది. క్రీస్తు శిరస్సైయున్న సంస్థ అల్పమైనదై ఉండ వీలుపడదు. ఆయన దానికి శిరస్సైయున్నాడన్న వాస్తవం దాని గొప్ప ప్రాధాన్యతను చాటుతుంది. క్రీస్తు శిరస్సుగానున్న శరీరములో అవయవమై ఉండడం ఎంత గౌరవంతో కూడినదైయుంటుంది!

స్పర్శ జ్ఞానానికిని, మనో భావాలకును శిరస్సు కేంద్ర స్థానమైయుంటుంది. దేహానికి ఏమి జరిగినా, అది అక్కడ అనుభూతి చెందుతుంది. మనం సంఘాన్ని ఘనపరచినప్పుడు, దాని శిరస్సును మనం ఘనపరచినవారమౌతాం, సంఘాన్ని అవమానపరచినప్పుడు దాని శిరస్సును అవమానపరచినవారమౌతాం. మత్తయి 25లోని తీర్పు దృశ్యం, ముందు ప్రతిపాదనలోని తొలి భాగాన్ని రుజువు చేస్తుంది. భూమిమీదనున్న క్రీస్తు సహోదరులకు సేవ చేస్తే క్రీస్తుకు సేవ చేసినట్లే. అపొ. 9:4లో ప్రభువు పౌలుతో అన్న ప్రతిపాదన ముందు చెప్పబడిన తరువాత భాగాన్ని రుజువు చేస్తుంది: సంఘాన్ని హింసించితే క్రీస్తును హింసించినట్టే. సంఘాన్ని గూర్చి మనం మాట్లాడే విధానంలో జాగ్రత్తగా ఉందాం! దాన్ని మనం ఎలా ట్రీట్ చేస్తామో దాని విషయంలో జాగ్రత్తగా ఉందాం!

## క్రైస్తవులతో క్రీస్తుకుగల సంబంధం

సంఘం అనే అంశాన్ని గూర్చి జరుగుతున్న అపార్థంకంటే దాదాపు మరి ఏ అంశం మీద యింతటి అపార్థం లేకపోవచ్చు. అది ఏమిటో అర్థం చేసుకోలేక పోవడం వల్ల సంఘాన్ని గూర్చి ఎక్కువ తప్పుడు భావాలు తలెత్తుతున్నాయి.

సంఘానికి నిర్వచనాన్ని వెదకుదాం. అది క్రీస్తు శరీరమైయుంది (ఎఫెసీ. 1:22, 23). అది ఒక జనుల సముదాయమనుకో, కాని ఏ జనులు? రక్షింపబడిన జనులు (అపొ. 2:47) – క్రొత్త నిబంధన క్రైస్తవులు. క్రీస్తు ఎవరిమీద ఏలికయైయున్నాడో,

రక్షింపబడిన ఆ జనుల సముదాయమే సంఘం. సంఘం యొక్క అసలైన నిర్వచనం దాని ప్రాముఖ్యతను చెప్పుతుంది.

సంఘం రక్షిస్తుందనే వాస్తవాన్ని కొందరు నమ్మరు. అది నిజమే; అది రక్షకుడు కాదు; క్రీస్తే రక్షకుడై యున్నాడు, మరియు ఆయన మాత్రమే రక్షించగలవాడైయున్నాడు. ఆయన రక్షించేది దేన్ని? శరీరాన్ని (ఎఫెసీ. 5:23).

ఆపైన అపార్థం సంఘం యొక్క ప్రాముఖ్యత, సభ్యత్వం యొక్క అవసరమును గూర్చినదై ఉంది. సమాధానపరచబడడం సంఘంలో జరుగుతుందనే పౌలుయొక్క ప్రతిపాదన సంఘం యొక్క ఆవశ్యతను చూపుతుంది (ఎఫెసీ. 2:16). సంఘమునకు వెలుపల నరులు దేవునితో సమాధానపరచబడనేరరు.

శరీరమునకు వెలుపల జీవం లేదు. శిరస్సుతో ఏకమైయుండాలంటే, ఒకడు శరీరంలోనే ఉండి తీరాలి. శరీరమునకు వెలుపల ఉండినప్పుడు శిరస్సుతో ఎవడును ఏకమై ఉండనేరడు. అవును, ఆత్మసంబంధమైన జీవం కావాలనుకుంటే ఒకడు సంఘంలోనే ఉండాలి. రక్షింపబడడానికి సంఘంలోనే ఉండనవసరం లేదనే సిద్ధాంతం తప్పు.

## క్రైస్తవులకు ఒకరితోనొకరికి గల సంబంధం

అనేక అవయవములు గల మానవ శరీరంగా సంఘాన్ని ఎఫెసీ. 4:16 చిత్రిస్తుంది. ప్రతి సభ్యుడు ప్రాముఖ్యమైయున్నట్టున్నూ, తనవంతు పని తనకు కలిగియున్నట్టున్నూ ఆ చిత్రం సూచిస్తోంది. మానవ శరీరానికి అనేక భాగములున్నట్టే – దానికి సంబంధించిన పని జరిగిస్తూ సర్వ శరీరానికి తనవంతు సమర్పిస్తున్నట్టు – క్రీస్తు శరీరానికి చెందిన మనము ఆయా పనులు కలిగియుండియు ఒక్కటే శరీరంగా ఉన్నాం (1 కొరింథీ. 12:25, 26). తాను ఆక్రమించిన స్థలాన్ని బట్టి, ప్రతి అవయవము అవసరమైనదే, మరియు ప్రతిదీ సర్వ శరీరానికి ప్రయోజనకరమైనదే. ప్రతిదానికి మరియొకటి అవసరమైనందున, తన్ను తాను హెచ్చించుకోకుండగను, యితరులను తృణీకరించ కుండగను, ప్రతివాడు తన పనిని చేయువాడై యుండాలి. సభ్యుల మధ్య గర్వం గాని అసూయ గాని ఉండరాదు (పనికి రాదు).

సంఘంలోని సభ్యులందరికి సానుభూతితో కూడిన శ్రద్ధ, అక్కర ఉండడం అవసరం. ఒకరు బాధపడితే, అందరూ బాధపడతారు. అవయవములలో ఒక దానికి రోగం సోకితే, సర్వ శరీరం కుంటుబడియుంటుంది. ఇతర అవయవముల యొక్క శక్తి అది బాగుపడడంలో నిమగ్నమైనవిగా ఉంటాయి. ఒక సహోదరుడు తప్పిపోయినట్లయితే, దాన్ని గూర్చి మనం మాట్లాడ కూడదు. శ్రద్ధ, సలహా, ప్రార్థన అనేవి తప్పిపోయిన సభ్యునిపట్ల సంఘమంతా ఆతురతను చూపాలి. మన విరోధి సహోదరుని యొద్దకు వచ్చినప్పుడు, బాధింపబడిన సభ్యునికి యితరుల యొక్క దయ కనికరములు చెందవలసి యుంటుంది. అలాగే, యితరులు సంతోషించినప్పుడు మనమందరం సంతోషించాలి. దీనిలో అసూయ ఏ మాత్రం ఉండకూడదు. సంఘంలో ఒక సభ్యుని యొక్క ఉచ్ఛ స్థితిగాని, విజయం కాని ఎవరికిని దుఃఖం కలుగజేయకూడదు. ఆ ఒక్క శరీరంలోని

సభ్యులమైయున్నామనే దానిలో ఉన్న సన్నిహితత్వం, ఆత్మ సంబంధమైన ప్రేమ, ఏకాభిప్రాయం అనేవాటిని మనం అనుభవిస్తున్నామా?

## ముగింపు

క్రీస్తునకును సంఘానికిని దాని సభ్యులకును ఉన్న సంబంధాన్ని గూర్చి మూడు పాఠాలు నేర్చుకున్నాం. క్రీస్తు సంఘమునకు శిరస్సును, మనం ఆయన శరీరమైన సంఘమైయుంటే ఆయన మన జీవితాలకు ప్రభువునై ఉన్నాడు. ఆయనతో ఏకమైయుండాలంటే మనం శరీరంలో ఏకమైయుండాలి, మరియు శరీర అవయవముల మధ్య ఏకత్వము, సహకారము నిలిచియుండాలి. క్రీస్తు మన అందరికి పైగానున్నాడు! మనం క్రీస్తులో ఉన్నాం! మనం ఒకరికొకరం అవయవములమైయున్నాం! క్రీస్తు శరీరములో ఉన్నవారి విషయములో ఈ ప్రతిపాదనలు నిజమైయుండాలి.

### ఇతరులను ప్రభావితం చేయడం ఎలా?

మనకు తెలియకుండగనే మనం యితరులను ప్రభావితం చేస్తాం. ప్రభువు యొక్క ఆహ్వానాన్ని స్వీకరించిన ఒక వ్యక్తిని అప్పుడప్పుడు నేను చూచాను, యితరులు ధైర్యం తెచ్చుకొని స్వీకరించేలా అది చేస్తుంది. ఇతరులు క్రైస్తవులయ్యేలా సహాయపడినట్టు మొదటివానికి తెలియక పోవచ్చు. మరి యింకా ఏ యితర మార్గాల్లో మనం యితరులను ప్రభావితం చేయగలుగుతాం?

**మన మాటల్లో.** (1 తిమోతి 4:12; ఎఫెసీ. 4:29; కొలస్సీ. 4:6లను చదువు) మనం ఎలా మాట్లాడతాం? లక్ష్యంలేని మాటలవలన ఆత్మలు నష్టపోవచ్చు.

**మన దైనిక జీవితాల్లో.** స్థిరమైన, క్రమబద్ధమైన క్రైస్తవ జీవితం యితరులను క్రీస్తు నొద్దకు నడిపించడానికి సహాయపడుతుంది. తమ వెలుగు ప్రకాశించునట్లు చేయడంలో వ్యాపారులకు గొప్ప అవకాశాలు ఉంటాయి. విశ్వాసంతో కూడిన జీవితంవలన క్రైస్తవ స్త్రీలు తమ భర్తలను గెలుచుకోవచ్చు (1 పేతురు 3:1).

**సంఘం యెడల మనకున్న వైఖరివలన.** సంఘం ప్రధానమైనదని ఇతరులను ఒప్పించడానికి, సంఘం మనకు ప్రాముఖ్యమైనదన్నట్టు మనం యితరులకు చూపాలి.